సాక్షి
ములుగు
మంగళవారం । 14 । మే । 2024



మూడు గుట్టలు..16 కిలోమీటర్లు..

వాజేడు మండల పరిధిలోని కొంగాల గ్రామ పంచాయతీలో ఉన్న పెనుగోలు ఓటర్లు మూడు గుట్టలు దిగి వచ్చి లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేశారు.

- 8లో ▸



సూర్యప్రభ వాహనంపై అమ్మవారి ఊరేగింపు

శ్రీభద్రకాళీభద్రేశ్వరుల కల్యాణ బ్రహ్మోత్సవాల లో భాగంగా సోమవారం అమ్మవారిని శోభాయమానంగా అలంకరించారు. - 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 41.9°/22.2°

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. అయితే పలుచోట్ల ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి



కన్నాయిగూడెం: ఏజెన్సీలో విధులు నిర్వహిస్తున్న వైద్యులు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్య అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆయన సోమవారం తనిఖీ చేశారు. అక్కడ రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. అలాగే మందుల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. స్థానిక వైద్యులు పోలింగ్ కేంద్రాల వద్ద అందిస్తున్న వైద్య సేవల గురించి సిబ్బందికి ఫోన్ చేసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీకి వచ్చిన ఓ గర్భిణికి డీఎంహెచ్‌ఓ వైద్యం అందించి పౌష్టికాహారం తీసుకోవాలని పలు సూచనలు చేశారు. అనంతరం డీఎంహెచ్‌ఓ అప్పయ్య మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, విధుల్లో అలసత్వం చేయొద్దని వైద్యాధికారులకు సూచించారు. వేసవి కాలంలో డీహైడ్రేషన్ తగ్గకుండా గ్లూకోజ్ వాటర్ తీసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌యూఓ నర్సింహారావు, హెల్త్ అసిస్టెంట్ భాస్కర్, మానిటరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తలకు టీఏ, డీఏ ఇవ్వాలి



ములుగు రూరల్: ఎన్నికల విధులు నిర్వహించిన ఆశ కార్యకర్తలకు టీఏ, డీఏ చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి, ఉపాధ్యక్షులు రత్నం రాజేందర్, గుండబోయిన రవిగౌడ్‌లు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా వ్యాప్తంగా ఎన్నికల విధుల్లో ఆశ కార్యకర్తలు మెడికల్ క్యాంపులు నిర్వహించారని తెలిపారు. ఆశ కార్యకర్తలకు టీఏ, డీఏ రూ.500 చెల్లించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా వైద్యాధికారి అల్లెం అప్పయ్యను వారు కోరారు. అలాగే ఫిక్స్‌డ్ వేతనాలు చెల్లించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఓటు హక్కు వినియోగంపై ఆశ కార్యకర్తలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ఓటు శాతం పెంచేందుకు పాటుపడుతున్నారని వివరించారు.

మధుకుమార్‌కు మెరుగైన వైద్యం అందించాలి



ములుగు: వెంకటాపురం(ఎం) మండలం బూర్గుపేట ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుడు పోరిక మధుకుమార్‌కు మెరుగైన చికిత్స అందించి త్వరగా కోలుకునేలా చూడాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టీఆర్‌టీఎఫ్) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోరిక శ్రావణ్‌కుమార్, అజ్మీరా రాజు ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా వారు సోమవారం విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికల విధులు నిర్వహించడానికి భద్రాచలానికి వెళ్లిన మధుకుమార్ బ్రేయిన్ స్ట్రోక్‌కు గురై కోమాలోకి వెళ్లారని తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని బేగంపేట కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని వెల్లడించారు.

విద్యుత్ పునరుద్ధరణ పనులు పూర్తి

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి డివిజన్ పరిధిలో ఆదివారం రాత్రి కురిసిన అకాల వర్షం, ఈదురుగాలులతో 33 కేవీ ఫీడర్, 11 కేవీ ఫీడర్ పరిధిలో ఆరు స్తంభాలు, రెండు ట్రాన్స్‌ఫార్మర్లు నెలకొరిగాయి. 23 ఇన్సులేటర్లు దెబ్బతినగా, 10 లైన్లు తెగి కింద పడ్డాయి. విద్యుత్ పునరుద్ధరణ పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టి అన్ని ప్రాంతాల్లో సరఫరా పునరుద్ధరించామని భూపాలపల్లి సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ మల్చూర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ సరఫరా అందించడానికి కృషిచేసిన ఉద్యోగులకు సిబ్బందికి ఎస్‌ఈ అభినందనలు తెలిపారు. సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి స్వయంగా కార్పొరేట్ కార్యాలయం నుంచి లోడ్, విద్యుత్ సరఫరా మానిటరింగ్ చేస్తూ ప్రతి సర్కిల్‌లో అధికారులకు సలహాలు, సూచనలు చేస్తున్నారన్నారు. ప్రతీ సర్కిల్ పరిధిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. విద్యుత్ సంబంధిత సమస్యలకు, ఫిర్యాదులు తెలియజేయడానికి టోల్ ఫ్రీ నంబరు 1800 425 0028 కు లేదా 1912కు ఫోన్ చేయాలని సూచించారు.

కన్నాయిగూడెంలో ఓటు వేసేందుకు బారులుదీరిన ఓటర్లు



ఏటూరునాగారంలో..

పోలింగ్ ప్రశాంతం

ములుగు అసెంబ్లీ సెగ్మెంట్‌లో 68.20 శాతం నమోదు

- గతంకంటే స్వల్పంగా పెరిగిన ఓటింగ్
- భారీ బందోబస్తు మధ్య రిసెప్షన్ సెంటర్‌కు చేరుకున్న ఈవీఎంలు
- అర్ధరాత్రి వరకు మహబూబాబాద్‌కు తరలించిన అధికారులు

ములుగు: ములుగు అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో పార్లమెంట్ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. ఈవీఎంలు, వీవీప్యాట్‌లు, బ్యాలెట్ యూనిట్లతో ఆదివారం రాత్రి వరకు పోలింగ్ సిబ్బంది కేంద్రాలకు చేరుకొని ఏర్పాట్లు చేసుకున్నారు. సోమవారం ఉదయం 6గంటలకు మాక్ పోలింగ్ ప్రారంభించగా 7గంటల నుంచి పోలింగ్ ప్రక్రియ మొదలైంది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సాయంత్రం 4గంటల వరకు మాత్రమే ఓటు వేసేందుకు అనుమతి ఉన్నా అప్పటికే కేంద్రాల్లో ఉన్న వారికి ఓటు వేసేందుకు అనుమతినిచ్చారు. రాత్రి 9గంటల వరకు గంగారం, కొత్తగూడ, ఏటూరునాగారం, ఎస్‌ఎస్‌తాడ్వాయి, కన్నాయిగూడెం మండలాల మారుమూల ప్రాంతాల నుంచి ఈవీఎంలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని రిసెప్షన్ సెంటర్‌కు చేరుకున్నాయి. అక్కడి నుంచి అర్ధరాత్రి వరకు పోలీసుల భారీ బందోబస్తు మధ్య మహబూబాబాద్‌లో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రం టీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీకి తరలించి రిటర్నింగ్ అధికారికి అప్పగించారు. వచ్చే నెల 4వ తేదీన ఫలితాలు వెల్లడికానున్నాయి.

ఓటర్ స్లిప్పులు ఇవ్వకపోవడంతో..

ములుగు జిల్లా కేంద్రంలోని గొల్లవాడలో ఓటర్లకు బూత్ సిబ్బంది ఓటరు స్లిప్పులు ఇవ్వలేదు. దీంతో వారంతా ఆధార్‌కార్డు పట్టుకొని పోలింగ్ కేంద్రానికి వచ్చారు. పోలింగ్ బూత్ దొరకకపోవడంతో అంగన్‌వాడీ సిబ్బంది తీరుపై అసహనాన్ని వ్యక్తం చేశారు. గమనించిన పోలీస్ అధికారి ప్రతాప్ ఓటర్ లిస్టులో పేరు, సీరియల్ నంబర్, పోలింగ్ కేంద్రం వివరాలను వెతికి పోల్‌చీటీలు ఇచ్చారు. అలాగే ఏటూరునాగారం మండలం ఎలిశెట్టిపల్లి గ్రామంలోని ఓటర్లు 2 కిలోమీటర్లు నడుచుకుంటూ ఓటు వేసేందుకు వాగు దాటి చెల్పాకకు చేరుకున్నారు. మరికొంతమంది ట్రాక్టర్ల ద్వారా చేరుకొని ఓటు వేశారు. బీఎల్‌ఓలు ఓటర్ స్లిప్స్ లేనివారికి రాసి ఇచ్చి సహాయ పడ్డారు.



ఓటు హక్కు వినియోగించుకున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ శ్రీజ

స్వల్పంగా పెరిగిన ఓటింగ్

గతంలో కంటే ఎక్కువ శాతం పోలింగ్ జరగాలని జిల్లా ఎన్నికల అధికారి, ఉన్నతాధికారులు చేసిన ప్రయత్నం కాస్త ఫలించింది. గత 2019 పార్లమెంట్ ఎన్నికల్లో నియోజకవర్గంలో 2,14,087 ఓట్లకుగాను 1,41,168 ఓట్లు పోలయ్యాయి. 65.94 శాతంగా పోలింగ్ నమోదయ్యింది. ఈ సారి జిల్లాలో 2,33,119 మంది ఓటర్లు ఉండగా 68.20 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. గతంలో కంటే స్వలంగా 2.26 శాతం ఓటింగ్ ఎక్కువగా నమోదు అయ్యింది.



ఓటుహక్కు వినియోగించుకున్న కలెక్టర్, అదనపు కలెక్టర్

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి శ్రీజ జిల్లా కేంద్రంలోని 136 పోలింగ్ కేంద్రంలో తమతమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇరువురు క్యూలో నిలబడి వెళ్లడం చూసిన వారంతా ఫాలో అయ్యారు. అనంతరం ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రాతో కలిసి పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. సెక్టార్ అధికారులు, ప్రిసైడింగ్ అధికారులతో మాట్లాడి ఓటింగ్ సరళిని చూశారు. 87క్రిటికల్ ప్రాంతాల్లోని 258 పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్, సీసీ ఫుటేజీలను కమాండ్ కంట్రోల్ రూం నుంచి ఎప్పటికప్పుడు పరిశీలించారు. అధికారులకు తగిన సూచనలు చేశారు. అదే విధంగా అంకన్నగూడెంలో డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్య దంపతులు ఓటు హక్కును వినియోగించుకున్నారు.



ఓటింగ్ సరళిని పరిశీలిస్తున్న ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ఎస్పీ శబరీశ్ ములుగు మండలంలోని జాకారం, మల్లంపల్లి, వెంకటాపురం(ఎం) మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. డీఎస్పీ రవీందర్‌తో కలిసి ఎన్నికల విధులు నిర్వహిస్తున్న సిబ్బంది, పర్యవేక్షణ చేస్తున్న అధికారులతో కలిసి పోలింగ్ కేంద్రాల సమీపంలోని రోడ్లపై ఉన్న వారితో మాట్లాడి సూచనలు చేశారు. 144 సెక్షన్ అమల్లో ఉండడంతో 100, 200 మీటర్ల దూరంలో ఒకరు, ఇద్దరు తప్పా ఎక్కువ మంది ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమస్యాత్మక, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోని ఆర్మ్‌డ్ రిజర్వ్, సీఆర్‌పీఎఫ్ బలగాలను మోహరింపజేశారు. ప్రశాతంగా పోలింగ్ ముగియడానికి సహకరించిన ప్రజలకు ఎస్పీ కృతజ్ఞతలు తెలిపారు.



జాకారంలో బందోబస్తును పరిశీలిస్తున్న ఎస్పీ శబరీశ్

పోలింగ్ కేంద్రాల్లో వైద్యారోగ్యశాఖ సేవలు

జిల్లా వ్యాప్తంగా 15పీహెచ్‌సీల పరిధిలోని 652మంది వైద్యారోగ్యశాఖ సిబ్బంది 366 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు సేవలు అందించారు. పర్యవేక్షణకు 12మంది సూపర్‌వైజర్లు ఆరు బృందాలుగా ఏర్పాటు చేయగా 176 పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి ఓటర్లకు అందించిన చికిత్సలు, ఇచ్చిన మందుల వివరాలను పరిశీలించారు. మొత్తం 10,532 మందికి చికిత్స అందించామని, వైద్యపరమైన ఇబ్బందులు తలెత్తితే వెంటనే తరలించడానికి 108, ఆర్బీఎస్కే నుంచి 15 వాహనాలను అందుబాటులో ఉంచామని డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్య తెలిపారు. పర్యవేక్షణ బృందాల్లో కమ్యూనిటీ హెల్త్ అధికారులు దుర్గారావు, సదానందం, డెమో తిరుపతయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ భాస్కర్, వెంకట్‌రెడ్డి, నరసింగారావు, దుర్గారావు, కోటిరెడ్డి, ఖలీల్, దేవేందర్ తదితరులు ఉన్నారు.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

రిసెప్షన్ సెంటర్‌కు చేరుకుంటున్న ఈవీఎంలు

ఈవీఎంలు, వీవీప్యాట్, బ్యాలెట్ బాక్సులతో ఎన్నికల అధికారులు ములుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని రిసెప్షన్ సెంటర్‌కు చేరుకున్నారు. చెక్ లిస్ట్ ప్రకారం సెక్టార్ అధికారులు పోలింగ్ సామగ్రిని తీసుకున్నారు. దీని కోసం 19 టేబుళ్లను ఏర్పాటు చేశారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి రిసెప్షన్ సెంటర్‌ను పరిశీలించారు. సిబ్బందికి విద్యుత్, ఇతర సౌకర్యాలు కల్పించారు. బందోబస్తుకు 1500 మంది పోలీసులు పాల్గొన్నారు.

ఈవీఎంల మొరాయింపు

కన్నాయిగూడెం మండల పరిధిలోని బుట్టాయిగూడెంలో మాక్ పోలింగ్ సమయంలో ఈవీఎం మొరాయించింది. దీంతో సెక్టార్ అధికారి ఆదేశాలతో కొత్త ఈవీఎం ఏర్పాటు చేశారు. ఏటూరునాగారం మండల పరిధిలోని కోయగూడ ఎల్లాపురం (రాంనగర్) 196 పోలింగ్ బూత్‌లో ఈవీఎం మొరాయించడంతో గంటపాటు ఆలస్యంగా ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. అదే విధంగా ఓ ఓటరు సెల్‌ఫోన్‌తో పోలింగ్ కేంద్రానికి రావడంతో కానిస్టేబుల్ అడ్డు చెప్పాడు. దీంతో అతను వాగ్వాదానికి దిగగా సీఐ రాజు అక్కడికి చేరుకుని చక్కదిద్దారు. అదే విధంగా ఎస్‌ఎస్‌తాడ్వాయి మండల పరిధిలోని బంధాల గ్రామ పరిధిలోని అటవీ ప్రాంతమైన లవ్వాలలోని పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మొరాయించింది. టెక్నీషియన్ వచ్చి లోపాన్ని సరిచేశారు. దీంతో పోలింగ్ ప్రక్రియ 30నిమిషాల పాటు నిలిచిపోయింది.



ట్రాక్టర్‌లో పోలింగ్ కేంద్రానికి వస్తున్న ఎలిశెట్టిపల్లి ఓటర్లు



ఈవీఎంలతో సెంటర్‌కు చేరుకుంటున్న ఎన్నికల సిబ్బంది



రిసెప్షన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో పోలింగ్ శాతం

నియోజకవర్గం	9గంటలు	11గంటలు	1గంటలు	3గంటలు	5గంటలు	6గంటలు
డోర్నకల్	14.6	33.33	53.71	64.51	70.86	74.38
మహబూబాబాద్	11.65	30.95	47.52	58.71	67.19	75.13
నర్సంపేట	11.2	28.5	43.6	62.3	73.01	75.60
ములుగు	10.38	29.79	50.66	61.23	67.92	68.20
పినపాక	11.95	32	49.82	60.68	65.91	66.00
ఇల్లెందు	11.9	30.3	47.58	61.86	69.11	70.55
భద్రాచలం	12.07	30.1	49.54	60.58	64.72	68.85
మొత్తం	11.96	30.71	48.91	61.41	68.4	70.68

ఉత్సాహంగా ఓటేశారు..

ఏటూరునాగారం/ములుగు: తొలిసారి ఓటు హక్కు వచ్చిన యువత ఈ ఎన్నికల్లో ఉత్సాహంగా తమ అమూల్యమైన ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. ములుగు మండలకేంద్రానికి చెందిన బైకాని నవనీత శ్రీకాకుళంలో అగ్రికల్చర్ బీఎస్సీ చదువుతోంది. ఇటీవల ఆమెకు కొత్తగా ఓటు హక్కు వచ్చింది. దీంతో సుమారు 15గంటల ప్రయాణించి వచ్చి జిల్లా కేంద్రంలోని 133వ పోలింగ్ కేంద్రంలో తొలిసారి ఓటు హక్కును వినియోగించుకుంది. అందుబాటులో ఉండి ఓటు వేయని వారికి నవనీత ఆదర్శంగా నిలిచింది. ఏటూరునాగారానికి చెందిన విశాల్ అలాగే మండల పరిధిలోని ఎక్కెల గ్రామానికి చెందిన నవీన, అక్షిత పోలింగ్ కేంద్రానికి చేరుకుని ఓటు వేయడం ఆనందంగా ఉందని తెలిపారు.



తొలిసారి ఓటుహక్కు వినియోగించుకున్న నవనీత



ఎక్కెలలో ఓటేసిన నవీన, అక్షిత



మొదటిసారి ఓటేసిన విశాల్

‘భారీ మెజారిటీతో గెలుస్తా’..



ములుగులో ఓటింగ్ వివరాలు తెలుసుకుంటున్న సీతారాంనాయక్

ములుగు: పార్లమెంట్ ఎన్నికలో ఎంపీగా భారీ మెజారిటీతో గెలుస్తానని మహబూబాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి అజ్మీరా సీతారాం నాయక్ అన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లాకేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలోని పోలింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఓటింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతుందన్నారు. ములుగులో ఓటర్ల కోసం చేసిన ఏర్పాట్లు బాగున్నాయని తెలిపారు.

ఓటేసిన ప్రముఖులు - ఫొటోలు 10లో ▸

మంచి భవిష్యత్‌కే తొలి ఓటు

- మొదటిసారి ఓటు హక్కు వినియోగించుకున్న యువత మనోగతం

- వివరాలు 8లో ▸

ఓటెత్తారు.. - మరిన్ని ఫొటోలు 8,9లో ▸

ఆ నాలుగు మండలాల్లో ముందే..

- మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో 74శాతం పోలింగ్

సాక్షి, మహబూబాబాద్: మహబూబాబాద్ పార్లమెంట్ పరిధి మానుకోట జిల్లాలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో సాయంత్రం 4గంటలకే పోలింగ్ ముగిసింది. ఇల్లెందు నియోజకవర్గంలోని బయ్యారం, గార్ల, ములుగు నియోకవర్గంలోని కొత్తగూడ, గంగారం మండలాల్లో ఉదయం 7గంటలకే పోలింగ్ ప్రారంభించి సాయంత్రం 4గంటలకు ముగింశారు. కాగా ఎప్పుడు పోలింగ్‌లో వెనకబడి ఉండే ఈ ప్రాంతాల్లో 74శాతం పోలింగ్ నమోదు కావడం విశేషం. ఓటరు చైతన్య, అవగాహన కార్యక్రమాలు, పోలీసులు ముందస్తు భద్రతా చర్యలు తీసుకోవడంతోనే పోలింగ్ శాతం పెరిగిందని అధికారులు చెబుతున్నారు.

ఏజెన్సీ మండలాల్లో నమోదైన పోలింగ్‌శాతం

మండలం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పోలింగ్‌శాతం
కొత్తగూడ	23,460	17,126	73
గంగారం	9,041	7,395	82
బయ్యారం	38,092	26,530	69
గార్ల	30,399	21,603	72

పోలింగ్ కేంద్రాలను సందర్శించిన బలరాంనాయక్

మంగపేట/ఎస్‌ఎస్‌ తాడ్వాయి: పలు మండలాల్లోని పోలింగ్ కేంద్రాలను మహబూబాబాద్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మంగపేట మండల పరిధిలోని కాంగ్రెస్ నాయకులతో కలిసి రాజుపేట, తిమ్మంపేట, బోరునర్సాపురం, మంగపేట, కమలాపురం తదితర గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను సందర్శించారు. అదే విధంగా ఎస్‌ఎస్ తాడ్వాయి మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాన్ని బలరాం నాయక్ సందర్శించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలతో పోలింగ్ సరళిపై చర్చించారు.



కమలాపురం పోలింగ్ కేంద్రాన్ని సందర్శిస్తున్న బలరాంనాయక్

వరంగల్‌లో ఎస్‌ఆర్‌ఆర్ తోటలోని వాణి విద్యానికేతన్ పోలింగ్ కేంద్రంలో ఓటు వేయడానికి బారులుదీరిన ట్రాన్స్‌జెండర్లు





జనగామ స్టేషన్ రోడ్ హైస్కూల్‌లో..



ఖానాపురం: బుధరావుపేటలో బారులుదీరిన ప్రజలు



ఆత్మకూరు : కటాక్షపూర్‌లో క్యూలైన్‌లో ఓటర్లు



చిన్నగూడూరు: ఓటు వేసేందుకు ట్రాక్టర్‌లో వస్తున్న గిరిజనులు

పోల్.. కూల్..

పార్లమెంట్ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో పోలింగ్ ఉదయం 7 గంటల ప్రారంభమై సాయంత్రం 6 గంటలకు ముగిసింది. సమస్యాత్మక ప్రాంతాల్లో సాయంత్రం 4గంటలకే ముగిసింది. ఓటు వేయడానికి ఉదయం నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులుదీరారు. దివ్యాంగులు, వృద్ధులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వీల్‌చైర్‌లు, ఆటోల ద్వారా తరలించి ఓటు వేయించారు. ఎన్నికల అధికారులు, పోలీసు సిబ్బంది కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నారు.



పర్వతగిరి : వృద్ధుడికి బూత్ వివరాలు తెలుపుతున్న తహసీల్దార్



గుంటూరుపల్లిలో బారులుదీరిన ఓటర్లు



భూపాలపల్లి రూరల్: రామయ్యపల్లిలో బారులుదీరిన ఓటర్లు



జనగామ అంబేడ్కర్ నగర్‌లో బారులుదీరిన ఓటర్లు

ఓటు.. భవిష్యత్‌కు పునాది



ఓటు హక్కు.. దేశ భవిష్యత్‌కు పునాది. స్థానిక సంస్థల నుంచి మొదలు.. లోక్‌సభ వరకు దేశ భవితవ్యం నిర్ణయించే ఎన్నికలు ఇవి. ఇందులో పౌరులు ఎలాంటి లాభాపేక్ష లేకుండా తమ ఓటు అనే వజ్రాయుధం ద్వారా సరైన నాయకుడిని ఎన్నుకుంటేనే దేశం అభివృద్ధిలో పయనిస్తుంది. లేనిపక్షంలో భవిష్యత్‌లో అంధకారం నెలకొంటుంది. కాగా, దేశంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతీ పౌరుడికి రాజ్యాంగం ఓటు హక్కు కల్పించింది. ఈ నేపథ్యంలో ఈ లోక్‌సభ ఎన్నికల్లో మొదటిసారి యువతీయువకులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. తమ అనుభవాలను 'సాక్షి'తో పంచుకున్నారు. ఆ వివరాలు వారి మాటల్లోనే..

- ఖిలా వరంగల్/వరంగల్/మహబూబాబాద్ రూరల్/ భూపాలపల్లి రూరల్

ఓటు వజ్రాయుధం



రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి. ఓటు వజ్రాయుధం. ఎన్నికల సంఘం ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపునిచ్చింది. యువ ఓటర్లలో వచ్చిన చైతన్యమే మంచి నేత విజయానికి తోడ్పాటు అందిస్తుంది.

- లైలా, ట్రాన్స్‌జెండర్స్ అసోసియేషన్ ప్రతినిధి

తొలి ఓటు వేయడం ఆనందంగా ఉంది



ఓటు హక్కు వచ్చిన తర్వాత తొలిసారి ఓటు వేయడం ఆనందంగా ఉంది. నా తొలి ఓటును ప్రజా సమస్యలు తీర్చే, అభివృద్ధి చేసే, నీతి, నిజాయితీ గల మంచి నాయకుడిని ఎంచుకొనేందుకు వేశా. ప్రజాస్వామ్యంలో ఓటు విలువైంది.

- ఎస్.సునాయన దీప్తి, శివనగర్, వరంగల్

అభివృద్ధికే నా తొలి ఓటు



అభివృద్ధి చేస్తానని భరోసా ఇచ్చిన నాయకుడికి నాతొలి ఓటు వేయడం సంతోషంగా ఉంది. ప్రస్తుత రాజకీయాల్లో అవినీతి, బంధు ప్రీతి, స్వార్థాన్ని నివారించాలంటే నిజాయితీ గల నాయకులను గెలిపించాలి. అందుకు యువత తమ చేతిలో ఉన్న ఓటు అనే ఆయుధాన్ని సమర్థంగా వాడుకోవాలి. భవిష్యత్‌లో మంచి రాజకీయ వ్యవస్థను నిర్మించే బాధ్యత యవతరంపైనే ఉందని నా అభిప్రాయం.

- మునుగోటి మిథిలి, పెరకవాడ వరంగల్

ఓటుతో ప్రజాస్వామ్యాన్ని రక్షిస్తాం



ఓటుతో ప్రజాస్వామ్యాన్ని రక్షిస్తాం. మొదటి సారి ఓటు హక్కు వినియోగించుకోవడం సంతోషంగా ఉంది. నేను కూడా సమాజంలో గుర్తింపు పొందా. ఎదుటి వారికి ఓటు హక్కు ప్రాధాన్యం తెలియజేస్తాననే నమ్మకం కలిగింది. ఓటు హక్కుతో మంచి ప్రజాప్రతినిధిని ఎన్నుకోవాలి.

- గుగులోత్ అంకిత, మహబూబాబాద్

సంతోషంగా ఉంది



మొదటి సారిఓటు హక్కు వినియోగించుకోవడం సంతోషంగా ఉంది. రాజ్యాంగం.. ఓటు ద్వారా మనకు నచ్చిన నాయకుడిని ఎన్నుకునే గొప్ప అవకాశం కల్పించింది. ఓటు విలువైంది.

- రాంనేని భార్గవి, గొర్లవీడు, భూపాలపల్లి

మంచి నేతకు తొలి ఓటు వేశా



వరంగల్ శివనగర్ ప్రకాశ్ మెమోరియల్ హైస్కూల్‌లోని 167వ పోలింగ్ బూత్‌లో నా తొలి ఓటు హక్కు వినియోగించుకున్నా. నిజాయితీ గల మంచి నాయకుడికి ఓటు వేశా. అభివృద్ధిని ఆకాంక్షించి మంచి నాయకుడి గెలుపునకు ఓటు వేశా.

- శామంతుల తేజ్ దీప్తి, శివనగర్

ఓటు హక్కు గొప్పది



ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు గొప్పది. మొదటిసారి ఓటు హక్కును వినియోగించుకున్నా. ప్రజలకు సేవ చేసే నాయకులను ఓటు ద్వారా ఎన్నుకునే గొప్ప అవకాశం రాజ్యాంగం మనకు కల్పించింది.

- గోరంటల మణిచరణ్, బీటెక్, ఫైనలియర్, వరంగల్

మంచి నాయకుడిని ఎన్నుకోవడం అదృష్టం



నేను మొదటిసారి ఓటు వేసినందుకు గర్వపడుతున్నా. ఒక మంచి నాయకుడిని ఎన్నుకోవడానికి నా ఓటు హక్కు దోహదపడింది. దేశానికి సేవ చేసే ప్రజాప్రతినిధులు.. ఎన్నికైన అనంతరం అందరికీ మేలు చేయాలి. అదే నా కోరిక.

- గుగులోత్ నిఖిత, మహబూబాబాద్

ఓటు కోసం ఖండాతరాలు దాటిన ఎన్‌ఆర్‌ఐ..

- స్ఫూర్తి నింపిన విష్ణువర్ధన్‌రెడ్డి



సిరా చుక్క చూపుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

గీసుకొండ : ఓ ఎన్‌ఆర్‌ఐ ఓటు విలువ చాటి చెప్పాడు. అమెరికాలో ఉన్న తాను ఓటు హక్కు వినియోగించుకుని పలువురికి స్ఫూర్తిగా నిలిచారు. వరంగల్ జిల్లా గీసుకొండ మండలం కొమ్మాలకు చెందిన వీరాటి రవీందర్‌రెడ్డి, స్వర్ణ దంపతుల కుమారుడు విష్ణువర్ధన్‌రెడ్డి బీటెక్ పూర్తి చేసి ఎంఎస్ చదవడానికి అమెరికాలో వెళ్లాడు. ఎంఎస్ పూర్తి చేసి ఐదేళ్లుగా అమెరికాలోనే ఉంటూ సాఫ్ట్‌వేర్ జాబ్ చేస్తున్నాడు. భారత్‌లో లోక్‌సభ ఎన్నికలు ఉన్నాయని తెలిసి ఐదు రోజుల క్రితం ఓటు వేయడానికి స్వగ్రామం వచ్చాడు. అమెరికా నుంచి రానుపోను ఫ్లైట్ చార్జీలు రూ. 2 లక్షలు చెల్లించి సోమవారం కొమ్మాలలో ఓటు వేశాడు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డిని గ్రామస్తులు అభినందించారు.

కమలాపూర్‌లో మరో యువకుడు..



ఓటు హక్కు వినియోగించుకున్న సందీప్

కమలాపూర్: కమలాపూర్‌కు చెందిన మాట్ల సందీప్ అమెరికా నుంచి వచ్చి తన స్వగ్రామం హనుమకొండ జిల్లా కమలాపూర్‌లో సోమవారం ఓటు హక్కు వినియోగించుకున్నాడు. మండల కేంద్రానికి చెందిన మాట్ల శంకర్, సరోజన దంపతుల రెండో కుమారుడు సందీప్ ఉన్నత చదువు నిమిత్తం ఆరు నెలల క్రితం అమెరికా వెళ్లాడు. తెలంగాణలో జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో అమెరికా నుంచి వచ్చి ఓటు వేశాడు. తాను కేవలం ఓటు హక్కు వినియోగించుకోవడం కోసమే అమెరికా నుంచి వచ్చినట్లు తెలిపాడు. కాగా, సందీప్‌ను పలువురు అభినందించారు.

ఓటు వేసి ఇంటికి వచ్చి అనంతలోకాలకు..

- గుండెపోటుతో మహిళ మృతి



వీరమ్మ(ఫైల్)

నర్సింహులపేట: ఓటు వేసి ఇంటికి వచ్చిన అనంతరం ఓ మహిళ గుండెపోటుతో మృతి చెందింది. ఈ ఘటన సోమవారం మండలంలోని కొమ్ములవంచలో జరిగింది. గ్రామానికి చెందిన దొంతు వీరమ్మ (58) తన కుమారుడు అశోక్‌తో కలిసి పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేసింది. తిరిగి ఇంటికి రాగానే గుండెపోటుకు గురై మృతి చెందింది. వీరమ్మ మృతితో గ్రామంలో విషాదం నెలకొంది. మృతురాలికి భర్త, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

మూడు గుట్టలు..16 కిలోమీటర్లు..

- కాలినడకన వచ్చి ఓటు వేసిన పెనుగోలు వాసులు



ఓటు వేయడానికి వస్తున్న పెనుగోలు గిరిజనులు

వాజేడు: అది గుట్టలపై ఉన్న ఆదివాసీల కుగ్రామం. మండల పరిధిలోని కొంగాల గ్రామ పంచాయతీలో ఉన్న పెనుగోలు. ఇక్కడ 12 కుటుంబాలు, 30 మంది జనాభా ఉంది. ఈ గ్రామంలో 22 మంది ఓటర్లు ఉన్నారు. రాజ్యాంగం తమకు కల్పించిన ఓటు హక్కును క్రమం తప్పకుండా వినియోగించుకుంటున్న వీరు.. సోమవారం కూడా మూడు గుట్టలు దిగి వచ్చి లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేశారు. గుట్టలపై ఉన్న పెనుగోలు గ్రామం నుంచి కాలి నడకన గుమ్మడి దొడ్డి వరకు 16 కిలో మీటర్లు వచ్చిన వారిని.. తహసీల్ కార్యాలయ సిబ్బంది ఆటో ద్వారా జంగాలపల్లి పోలింగ్ కేంద్రానికి తరలించారు. ఓటు వేసిన తరువాత వారు విలేకరులతో మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కును వినియోగించుకోవాలని గుట్టలు దిగి వచ్చి ఓటు వేసినట్లు తెలిపారు.

ఓటు వేసిన వీడియో వైరల్..

- వ్యక్తిపై కేసు నమోదు



హేమ్లాతండాలో ఘర్షణ పడుతున్న బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కార్యకర్తలు

నెల్లికుదురు : మండలంలోని హేమ్లా తండాలో ఓ వ్యక్తి ఓటు వేస్తూ వీడియో తీశాడు. అనంతరం సోషల్ మీడియాలో పోస్టు చేయగా వైరలైంది. ఈ ఘటనలో సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై క్రాంతికిరణ్ సోమవారం తెలిపారు. తండాలోని 160 పోలింగ్ కేంద్రంలో తండాకు చెందిన బానోత్ బాలకృష్ణ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తున్న వీడియో తీసి సోషల్ మీడియాలో వైరల్ చేశాడు. దీంతో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ వర్గాల మధ్య పోలింగ్ కేంద్రం సమీపంలో స్వల్ప ఘర్షణ జరిగింది. ఈ విషయంపై ప్రిసైడింగ్ ఆఫీసర్ ఎస్. నాగరాజు ఫిర్యాదు మేరకు బాలకృష్ణపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు.

మానుకోటలో యువకుడిపై..

మహబూబాబాద్ రూరల్ : తాను ఓ పార్టీకి ఓటు వేసిన దృశ్యాలను ఓ యువకుడు సోషల్ మీడియాలో పోస్టు చేయగా అతడిపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి గాంధీపురం గ్రామానికి చెందిన దేవనబోయిన శ్రీకాంత్ స్థానిక పోలింగ్ కేంద్రంలో తన ఓటు హక్కు వినియోగించుకున్నాడు. అదేవిధంగా తాను ఏ పార్టీకి ఓటు వేశాడో అనే విషయ దృశ్యాలను సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. దీంతో ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి వీరన్న పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు మహబూబాబాద్ రూరల్ ఎస్సై వి.దీపికారెడ్డి తెలిపారు.

వీవీ ప్యాట్ ఫొటో వైరల్



వాట్సాప్‌లో వైరలైన వీవీ ప్యాట్‌లోని ఫొటో

సంగెం: మండలంలోని ఎల్గూర్‌స్టేషన్‌లోని 211 పోలింగ్ కేంద్రంలో ఓటు వేసిన తర్వాత వీవీ ప్యాట్‌లో వచ్చిన ఫొటో తీసి గుగులోత్ గోపి వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ చేశాడు. దీంతో అతడిపై చర్య తీసుకోవాలని స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు ఎన్నికల సెక్టార్ అధికారి సాయిరాజ్‌తో వాగ్వాదానికి దిగారు. ఈ విషయాన్ని ఫోన్ ద్వారా ఉన్నతాధికారులకు తెలియజేసినట్లు సెక్టార్ అధికారి సాయిరాజ్ తెలిపారు.

పోలింగ్ బహిష్కరించిన చింతలగడ్డ వాసులు

- బూత్ ఏర్పాటు చేయకపోవడంపై నిర్ణయం
- 295 ఓట్లకు గానూ 15 మందే ఓటు హక్కు వినియోగం



నిరసన వ్యక్తం చేస్తున్న చింతలగడ్డతండా ఓటర్లు

మరిపెడ రూరల్: సుదూర ప్రాంతంలో ఉన్న తమ తండాలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని కొద్ది రోజులుగా విన్నవించినా తమ మాటను అధికారులు లెక్క చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ మహబూబాబాద్ మండలం చింతలగడ్డ తండా వాసులు సోమవారం పోలింగ్ బహిష్కరించారు. తాళ్లఊకల్ రెవెన్యూ పరిధిలోని చింతలగడ్డతండా, రేఖ్యతండా, రూప్‌సింగ్‌తండాను కలిపి చింతలగడ్డతండా జీపీగా ఏర్పాటు చేశారు. 295 ఓట్లు ఉన్న చింతలగడ్డతండాలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని 20 రోజులుగా అధికారులకు విన్నవిస్తే పట్టించుకోలేదు. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా రూప్‌సింగ్ తండాలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. దీంతో రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పోలింగ్ కేంద్రానికి నడవలేక పోతున్నామని, కావాలనే తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఓటు వేయడానికి వెళ్లమని తండావాసులు మొండికేశారు. విషయం తెలుసుకున్న మరిపెడ తహసీల్దార్ సైదులు, సీఐ హతిరాంనాయక్, ఎస్సై షేక్ తాహేర్‌బాబా.. తండాకు చేరుకుని వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినా ససేమిరా అనడంతో చేసేది లేక ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలిపి తండాకు బూత్ మంజూరయ్యేలా చూస్తామని సర్ది చెప్పి వెనుదిరిగారు. కాగా, అధికారులు వెళ్లాక కేవలం 15 మంది మాత్రమే వెళ్లి రూప్ సింగ్‌తండా పోలింగ్ కేంద్రంలో ఓటు వేసినట్లు తెలిసింది.

సూర్యప్రభ వాహనంపై అమ్మవారి ఊరేగింపు





శ్రీభద్రకాళి అమ్మవారు, సూర్యప్రభవాహనంపై అమ్మవారు

హన్మకొండ కల్చరల్ : శ్రీభద్రకాళి దేవాలయంలో శ్రీభద్రకాళిభద్రేశ్వరుల కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయప్రధానార్చకుడు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో ఉదయం నుంచి నిత్యాహ్నికం జరిపి అనంతరం చతుస్థానార్చన సదస్యం నిర్వహించారు. అమ్మవారిని పూలమాలలతో శోభాయమానంగా అలంకరించారు. ఉదయం అమ్మవారి ఉత్సవమూర్తిని సూర్యప్రభవాహనంపై జైభద్రకాళి అంటూ జయజయధ్వానాలు చేస్తుండగా మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్ఛాణలతో ఊరేగించారు. అదే విధంగా సాయంత్రం హంసవాహనంపై ఊరేగించారు. పూజా కార్యక్రమాలకు బాకరాజు చంద్రశేఖర్‌రావు, రాజశ్రీ దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు.

సీబీఎస్‌ఈ టెన్త్ ఫలితాల్లో 'ఎస్‌ఆర్' ప్రభంజనం



జి వర్ష



తేజస్వి



మేఘన

విద్యారణ్యపురి: సీబీఎస్‌ఈ టెన్త్ పరీక్షల ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. ఇందులో ఎస్‌ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని ఆ విద్యాసంస్థల చైర్మన్ ఎ వరదారెడ్డి, డైరెక్టర్లు ఎ మధుకర్‌రెడ్డి, ఎ సంతోష్ తెలిపారు. 500 మార్కులకుగాను జి వర్ష 485, టి సాయి ప్రణవ్‌రెడ్డి 484, ప్రేమ్‌చరణ్‌సాహు 481 మార్కులు, డి శ్రేష్ఠరెడ్డి 477 మార్కులు సాధించారని వారు తెలిపారు. ఈ విజయానికి కారణం క్రమశిక్షణతో కూడిన విద్య, పటిష్ఠ ప్రణాళిక, అంకితభావం కలిగిన అధ్యాపక బృందం అని తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులు, ప్రోత్సహించిన తల్లిదండ్రులు, అధ్యాపక బృందానికి వారు అభినందనలు తెలిపారు.

12వ తరగతి ఫలితాల్లో..

సీబీఎస్‌ఈ 12వ తరగతి పరీక్షల ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో ఎస్‌ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు విజయభేరి మోగించారని ఆ విద్యాసంస్థల చైర్మన్ ఎ వరదారెడ్డి, డైరెక్టర్లు ఎ మధుకర్‌రెడ్డి, ఎ సంతోష్‌రెడ్డి తెలిపారు. ఎంపీసీలో 500 మార్కులకు పి మేఘన 482, తుమ్మ తేజస్వి 480, రిషికేష్‌రెడ్డి 478 మార్కులు సాధించారని తెలిపారు. ఈ విజయం సాధించిన విద్యార్థులు, ప్రోత్సహించిన తల్లిదండ్రులు, అధ్యాపక బృందానికి వారు అభినందనలు తెలిపారు.

ఏకశిల విద్యాసంస్థల విజయభేరి



విద్యార్థులను అభినందిస్తున్న డాక్టర్ గౌరు తిరుపతిరెడ్డి

హసన్‌పర్తి: సీబీఎస్‌ఈ పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఏకశిల విద్యాసంస్థల విద్యార్థులు విజయభేరి మోగించారు. 500 మార్కులకు 483, 479, 479, 478, 477, 476 మార్కులు సాధించినట్లు ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గౌరు తిరుపతిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది కూడా సీబీఎస్‌ఈ పదో తరగతి పరీక్ష ఫలితాల్లో తమ విద్యాసంస్థల హవా కొనసాగిందన్నారు. ఉపాధ్యాయుల కృషి ఫలితమే ఈ ఫలితాలు అన్నారు. కార్యక్రమంలో ఏకశిల విద్యాసంస్థల డైరెక్టర్ సువిజారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కేడీ స్వర్ణరాజ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రీన్‌వుడ్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ



అరుణ్‌బాబు



ఎం హ ర్షిణి

కాజీపేట అర్బన్ : సీబీఎస్‌ఈ టెన్త్ పరీక్షల ఫలితాల్లో గ్రీన్‌వుడ్ విద్యాసంస్థల విద్యార్థులు ప్రతిభ చాటారని ఆ విద్యాసంస్థల డైరెక్టర్లు చల్లా ధర్మారెడ్డి, డాక్టర్ గిర్రెం భరద్వాజనాయుడు తెలిపారు. 500 మార్కులకు టి అరుణ్ బాబు 490, ఎం హర్షిణి 489, కె శృతీష్‌రెడ్డి 487, ఇ కారుణ్య 487, కె ప్రీతికారెడ్డి 484, సీహెచ్ వేదజ్ఞ 483 మార్కులు సాధించారన్నారు. 440 మార్కులపైన సాధించిన విద్యార్థులు 65 మంది ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయా విద్యార్థులను అభినందించారు. గ్రీన్‌వుడ్ మేనేజర్ ప్రభుకుమార్, అకడమిక్ ప్రిన్సిపాళ్లు వి నవీన్‌కుమార్, మంజుల, అడ్మినిస్ట్రేటివ్ ప్రిన్సిపాల్ టి పవన్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ వి సురేష్‌కుమార్, ఫైనాన్స్ ఆఫీసర్ షేక్ రబ్బాని మురళి, అకడమిక్ కోఆర్డినేటర్స్ శ్రీకాంత్, హర్ష అభినందించారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

ఎల్కతుర్తి: అనారోగ్య సమస్య కారణంగా మనస్తాపానికి గురైన ఓ మహిళ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన సోమవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం మంగళంపల్లిలో జరిగింది. వంగర ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన దంపు శోభ(42) గతంలో పురుగుల మందు తాగింది. అప్పటి నుంచి అనారోగ్య సమస్యలు ప్రారంభమయ్యాయి. ఎన్ని ట్యాబ్లెట్లు వాడినా తగ్గకపోగ మరింత పెరిగాయి. దీంతో ఈ బాధ భరించలేక మనస్తాపానికి గురైన శోభ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై మృతురాలి కుటుంబీకుల మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని హుజూరాబాద్ మార్చురీకి తరలించినట్లు ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు తెలిపారు.

వడదెబ్బతో కార్మికుడి మృతి

బయ్యారం: వడదెబ్బతో తునికాకు కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని రామచంద్రాపురం పంచాయతీ పరిధి సింగారంలో జరిగింది. గ్రామానికి చెందిన సూర్నబాక జగ్గయ్య(59) ఆదివారం తునికాకు సేకరణకు వెళ్లాడు. అదే రోజు రాత్రి అస్వస్థతకు గురై మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.